సంరక్షణతోనే పాడి అభివృద్ధి

- గాలికుంటు టీకాలు వేయించాలంటున్న పశువైద్యులు
- అక్టోబర్ 15 వరకు పశువులకు వ్యాక్సినేషన్ ప్రక్రియ
- సద్వినియోగం చేసుకోవాలంటున్న అధికారులు


దూడకు గాలికుంటు వ్యాధి టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది (ఫైల్)

సిద్దవటం : మండలం లోని చాలామంది రైతులు పశుసంపదపై ఆధారపడి జీవిస్తున్నారు. ఎంత కరువు వచ్చినా ఆదుకునే పాడి పరిశ్రమనే నమ్ము కొని బతుకుతున్నారు. ప్రస్తుత వర్షాకాలంలో ఆయా పశువులకు వచ్చే వ్యాధుల పట్ల రైతులు అప్రమతంగా ఉండాలని వాటిని సంరక్షించుకుంటేనే ఆదాయమని సిద్దవటం మండలం భాకరాపేట పశు ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ శివశంకర్ పేర్కొన్నారు. వర్షాకాలంలో పశువులకు ప్రధానంగా వచ్చే వ్యాధిలో గాలికుంటు వ్యాధి ఒకటి. ఇది వైరస్ సోకడం, లేదా కలుషితమైన గాలి ద్వారా వస్తుంది. తల్లిపాల ద్వారా దూడలకు వచ్చే అవకాశం ఉంది. ప్రతి ఏడాది వర్షాకాలంలో గేదె, ఎద్దు, ఆవులకు వచ్చే వ్యాధుల్లో గాలికుంటు వ్యాధి ఒకటి. గిట్టలు ఉన్న ప్రతి జీవికి ఈ వ్యాధి వస్తుంది. వ్యాధి సోకిన సమయంలో పశువుకు 104 నుంచి 105 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత ఉంటుంది. నోటిలో, గిట్టల మధ్య పుండ్లు పుట్టి పాడి పశువులు నడవలేని స్థితికి చేరతాయి. వర్షాలు ఎక్కువగా ఉండి చలి పెడుతున్నప్పుడు ఈ వ్యాధి విజృంభిస్తుంది. ఈ వ్యాధి సోకిన పశువులకు నోటిలో, గిట్టల మధ్య బొబ్బలు ఏర్పడతాయి. 3, 4 వారాల్లో బొబ్బలు పగిలి పుండ్లుగా మారతాయి. పొక్కులు ఏర్పడటం చేత పశువులు మేత తీసుకోలేక నీరసించిపోతాయి. ప్రధానంగా వర్షాకాలంలో నేలలు చిత్తడిగా ఉండడం వల్ల గాలికుంటు వ్యాధి వస్తుంది. ఈ వ్యాధి వల్ల చూడి గేదెలు ఈసుకుపోతాయి. పాడి గేదెలకు పాల దిగుబడి గణనీయంగా తగ్గుతుంది. ఈ వ్యాధి నివారణకు ఈనెల 15వ తేదీ నుంచి అక్టోబర్ 15వ తేదీ వరకు మండల వ్యాప్తంగా ఆయా తేదీలలో పశువులకు ఉచితంగా టీకాలు వేస్తున్నారు. ఈ టీకాల వల్ల పశువులు రోగనిరోధక శక్తిని కలిగి ఉంటాయి.

చికిత్స:
వ్యాధి సోకిన పశువులను మంద నుంచి వేరు చేయాలి. నోటిలోని పుండ్లకు బోరిక్ పౌడర్, గ్లిజరిన్ కలిపి పూయాలి. గిట్టల మధ్య పుండ్లకు పరమాంగనేట్ ద్రావణంతో శుభ్రం చేసి వేప నూనె రాయాలి. యాంటీబయోటిక్స్, పెయిన్ కిల్లర్ వాడితే ఉపశమనం కలుగుతుంది. బిస్ప్రే పెన్ 2.5గ్రాములు, ఎన్రోఫ్లాక్సిన్ 50 ఎంఎల్, సెఫ్ట్రిక్సన్ 3 గ్రాములు, మెలోనెక్స్ 30 ఎంఎల్, నిమోవెట్ 50 ఎంఎల్ వాడితే పశువులు పూర్తిగా ఆరోగ్యంగా ఉంటాయి.

జబ్బ వాపు వ్యాధి:
ఈ వ్యాధి క్లాస్ట్రీడియం చోవై బ్యాక్టీరియా ద్వారా పశువులకు సోకుతుంది. ఆరు నెలల నుంచి రెండేళ్ల లోపు వయసు ఉన్న పశువులకు ఎక్కువగా సోకుతుంది. ఈ వయసులో పశువులకు రోగ నిరోధక శక్తి చాలా తక్కువగా ఉంటుంది. భుజం, తొడ ప్రాంతాలలోని కండరాలను ఆశించి ఆ కండలు కుళ్లిపోయేలా చేస్తుంది. వాపుతో పశువులు కుంటుతాయి. వెనుక కాలు గాని ముందు కాలు గాని పైకి లేపి ఉంచి కుంటడం చేస్తాయి.

చికిత్స :
ఈ వ్యాధి ప్రారంభంలోనే పెన్సిలిన్ వంటి యాంటీ బయోటిక్స్ వాడాలి. వ్యాధిగ్రస్త పశువులను వేరు చేయాలి. వ్యాధితో చనిపోయిన పశువులను గుంత తీసి పూడ్చివేయాలి. వ్యాధి రాకుండా వర్షాకాలము ముందే వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి.

రైతులకు వరం కిసాన్ ధన్ ఆరోగ్య యోజన


రైతులకు అవగాహన కల్పిస్తున్న పీవీఆర్ ప్రతినిధులు

లక్కిరెడ్డిపల్లి : రైతులు కిసాన్ ధన్ ఆరోగ్య యోజన బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పీవీఆర్ గ్రూప్స్ ప్రతినిధులు సూచించారు. బుధవారం సంస్థ ఆధ్వర్యంలో పర్వత రెడ్డిగారిపల్లి, అప్ప కొండయ్యగారిపల్లి, గంగనపల్లిలో రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ కిసాన్ ధన్ ఆరోగ్య యోజన పథకంలో ప్రతి రైతు చేరాలన్నారు. చేరిన రైతుల సహాయానికి రూ.25వేలు, పంట నష్టపరిహారం జరిగితే రూ. 50వేలు, అనుకోని ప్రమాదంలో మరణిస్తే రూ.3లక్షలు అందుతాయని తెలియజేశారు. మహిళలకు యూనిట్ రూ. 5 వేలు నుంచి రూ. లక్ష వరకు రుణ సౌకర్యంతోపాటు వ్యవసాయ పరికరాల కొనుగోలుపై 30 శాతం వరకు సబ్సిడీ ఉంటుందన్నారు. కోళ్ల పెంపకం, గోశాల, చేపల పెంపకం, తేనెటీగల పెంపకం, కోల్డ్ స్టోరేజ్లకు రుణాలు ఇస్తామని చెప్పారు. వివరాల కోసం మండల కో-ఆర్డినేటర్ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో రాయలసీమ కో-ఆర్డినేటర్ కె.మల్లికార్జున, కడప, అన్నమయ్య జిల్లాల అవేర్నెస్ మేనేజర్ సంపత్, రాయలసీమ అవేర్నస్ మేనేజర్ మణికంఠ, మేనేజర్ సాయి, సంస్థ ప్రతినిధులు రమాదేవి, హరికృష్ణ, తేజ తదితరులు పాల్గొన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోండి


డిప్యూటీ తహసీల్దార్కు వినతిపత్రం సమర్పిస్తున్న సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ నాయకులు

గాలివీడు : మండలంలో ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్న అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి విశ్వనాథ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆ పార్టీ నాయకులతో రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ను బుధవారం కలసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం విశ్వనాథ్ మాట్లాడుతూ గాలివీడు టౌన్ పరిధి సర్వే నంబర్ 475లో 80 సెంట్లు ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించారని ఆరోపించారు. అధికారులు సర్వే చేసి ఆక్రమణకు గురైన స్థలాన్ని స్వాధీనం చేసుకుని ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎం.రఘునాథ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో రోగాలు దూరం


వైద్యశిబిరం నిర్వహిస్తున్న 104 సిబ్బంది

సిద్దవటం : వాతావరణ మార్పుల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు పాటించాలని మాధవరం ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ శ్రీవిద్య తెలిపారు. సిద్దవటం మండలంలోని పార్వతీపురం గ్రామం రోడ్ నెంబర్ 2 నందు బుధవారం 104 వైద్యశిబిరం ఏర్పాటు చేసి సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీవిద్య మాట్లాడుతూ ఇంటి పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీరు నిల్వ ఉన్న చోట దోమలు వృద్ధి చెందుతాయని చెప్పి అరికట్టేందుకు చర్యలను తెలియజేశారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఎటువంటి రోగాలు దరిచేరవని వైద్యాధికారి డాక్టర్ శ్రీవిద్య చెప్పారు. అనంతరం దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు నెలకు సరిపడా మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పెట్టుబడిదారులకు ప్రభుత్వం వత్తాసు



డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు

రాజంపేట రూరల్ : కూటమి ప్రభుత్వం పెట్టుబడిదారులకు వంత పాడుతూ కార్మికుల శ్రమను దోపిడీ చేసేందుకు పనిగంటలను పెంచిందని ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి ఇ.సికిందర్ మండిపడ్డారు. స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ వద్ద నున్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సికిందర్ మాట్లాడుతూ పనిగంటలు పెంచుతూ కూటమి ప్రభుత్వం చేపట్టిన కార్మిక చట్టాల సవరణను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గత 13 సంవత్సరాలుగా కనీస వేతనాలను ప్రభుత్వం సవరించలేదన్నారు. పెరిగిన ధరలు అనుగుణంగా వేతనాలను తక్షణమే సవరించి కార్మికులను ఆదుకోవాలన్నారు. అసెంబ్లీ సమావేశాలలో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆందోళలను చేస్తుంటే కార్మికులకు వ్యతిరేకంగా ప్రభుత్వం చర్యలు చేపట్టడం దారుణమన్నారు. ధర్నాలో నాగేశ్వరరావు, రమణ, సురేష్, మౌలా, నరసింహులు, రవి, రాఘవేంద్ర, రమేష్, తులసీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

పశువుల పాకను శుభ్రంగా ఉంచుకోవాలి


నందలూరు: పశువులకు టీకాలు వేస్తున్న పశు వైద్య సిబ్బంది


సిద్దవటం: పశువులకు టీకాలు వేస్తున్న పశు సంవర్ధక శాఖ అధికారులు

సిద్దవటం : మండలంలోని జ్యోతి, గొల్లపల్లి గ్రామాల్లో పాడి పశువులకు గాలికుంటు వ్యాధికి బుధవారం టీకాలు వేశామని వెటర్నరీ లైవ్ స్టాక్ అసిస్టెంట్ జిలానీబాషా తెలిపారు. ఈ సందర్భంగా లైవ్ స్టాక్ అసిస్టెంట్ జిలానీబాషా మాట్లాడుతూ మాచుపల్లి పశువైద్యశాల అధికారి డాక్టర్ విజయరాజు ఆధ్వర్యంలో పాడి రైతుల బర్రెల గాలికుంటు నివారణకు వ్యాక్సిన్ పంపిణీ చేశామన్నారు. వర్షాకాలంలో పాడి రైతుల పశువుల జాగా శుభ్రంగా పెట్టుకోవాలని అపరిశుభ్రత ఉంటే గేదెలకు గిట్టల వ్యాధి సోకే ప్రమాదం ఉందని నివారణకు వ్యాక్సిన్ పంపిణీ చేసి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు, సూచనలు అందించామన్నారు.

నందలూరులో..
నందలూరు : పశువులలో వచ్చే వ్యాధుల పట్ల పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని రాజంపేట డివిజన్ పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు డాక్టర్ విజయభాస్కర్ పేర్కొన్నారు. బుధవారం నందలూరు మండలం నాగిరెడ్డిపల్లి, నల్లతిమ్మాయపల్లి పంచాయతీలలోని గ్రామాలలో పశువులకు టీకాలు వేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో పాటూరు, నందలూరు పశువైద్యులు డా.ఈశ్వర్ప్రసాద్, డా.వై.మాధవీలత, జేవీఓలు సుగుణ, గంగులయ్య, వీఏ సుదర్శన్రెడ్డి, ఏహెచ్ఏలు సుస్మిత, శ్రీనాథ్రెడ్డి, రెడ్డిప్రసాద్, జాహ్నవి, శిరీష పాల్గొన్నారు.

కర్కటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

చిట్వేలి : కలియుగదైవం గుండాల కోన కర్కటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు పోస్టర్లను ఆలయ కమిటీ సభ్యులు చైర్మన్ రాజశేఖర్ బుధవారం ఆవిష్కరించారు. ఈ మేరకు గుండాల కోన కర్కటేశ్వర స్వామి దేవస్థానం నందు 12 శివలింగాలకు సామూహికంగా భక్తులచే అభిషేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు కమిటీ సభ్యులు తెలియజేశారు. నవంబర్ 27వ తేదీ నుంచి ప్రారంభంకానున్న ఈ ఉత్సవాలు ఐదు వారాలపాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్తీక పౌర్ణమి నాడు మహన్యాస పూర్వక ఏకవార రుద్రాభిషేకానికి రూ. 5,116లు నగదు చెల్లించి పూజా కార్యక్రమంలో పాల్గొనవచ్చన్నారు. ప్రతి సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. మరెన్ని వివరాలకు 77102 03050 నెంబర్ను సంప్రదించాలన్నారు.

టీకాల కార్యక్రమం తనిఖీ


గాలికుంటు టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఉప సంచాలకులు డాక్టర్ డి.మాలకొండయ్య

వీరబల్లి : పశు సంవర్ధకశాఖ ఉప సంచాలకులు డాక్టర్ డి.మాల కొండయ్య గాలికుంటు టీకాల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతి గ్రామంలో కార్యక్రమాన్ని నిర్వహించాలని తెలియజేశారు. మండల పశు వైద్యాధికారి డాక్టర్ డి.గణేష్ ఆధ్వర్యంలో సిబ్బంది పిచ్చిగుంటపల్లి, నాయనవారిపల్లి, వంగిమల్ల, నాగిరెడ్డిగారిపల్లి గ్రామాల్లో పశువులకు టీకాలు వేశారు.

పర్యావరణ పరిరక్షణకు నడుం బిగిద్దాం


లక్కిరెడ్డిపల్లె: స్వచ్ఛభారత్లో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు



నందలూరు: మండల కేంద్రంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ర్యాలీ

లక్కిరెడ్డిపల్లి : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని ప్రిన్సిపల్ వేంపల్లి రామ్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ డే (జాతీయ సేవా పథక దినోత్సవం)ను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులలో సేవా భావంతోపాటు నాయకత్వ లక్షణాలను పెంపొందించడమే జాతీయ సేవా పథకం ముఖ్య లక్ష్యమని ఆయన తెలిపారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థులు స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పాల్గొని కళాశాల పరిసర ప్రాంతాలలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్తమ సేవలందించిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు సహదేవ రెడ్డి, సుందరరావు, శాంతయ్య, కళ్యాణి, అనూష, అధ్యాపకేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నందలూరులో విద్యార్థుల ర్యాలీ
నందలూరు : ఎన్ఎస్ఎస్ వ్యవస్థాపక దినోత్సవాన్ని నందలూరులో ఘనంగా నిర్వహించారు. బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో ఎన్ఎస్ఎస్ లక్ష్యాలను తెలియజేసేలా మండల కేంద్రంలో ర్యాలీ తీశారు. సమాజ శ్రేయస్సులో ఎన్ఎస్ఎస్ పాత్రను అధ్యాపకులు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీదేవి, ఎన్ఎస్ఎస్ పీఓ డా.పి.నీలవేణి, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు లోక్ కళ్యాణ మేళా

రాయచోటి జగదాంబసెంటర్ : రాయచోటి పట్టణంలోని మెప్మా కార్యాలయం వద్ద ఈ నెల 25న లోక్ కళ్యాణమేళా పీఎం స్వానిధి 2.0 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మెప్మా పీఎంఎం పి.అబ్బాస్ అలీఖాన్ తెలియజేశారు. బుధవారం స్థానిక మెప్మా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కార్యక్రమంలో భాగంగా వీధి విక్రయదారులు, చిన్న వ్యాపారస్తులకు మొదటి సారి రూ.15 వేలు, రెండవ సారి రూ.25 వేలు, మూడవ సారి రూ.50 వేలు అందిస్తామన్నారు. లోన్ కావాల్సిన వారు ఆధార్, పాస్బుక్, రేషన్ కార్డు వంటి ధృవీకరణ పత్రాలు తీసుకురావాలని తెలియజేశారు.

మహిళా సాధికారతతోనే దేశం ముందంజ


రక్తదాతలకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న వైద్యులు

రాయచోటి జగదాంబసెంటర్ : మహిళలు సాధికారత సాధించినప్పుడే దేశం అన్ని రంగాల్లో ముందంజలో ఉంటుందని శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్రెడ్డి తెలిపారు. బుధవారం రాయచోటి పట్టణం మాసాపేటలోని శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డెర్మటాలజీ డాక్టర్ నవ్యత, ప్రజా చైతన్య సేవా సంఘం అధ్యక్షురాలు స్వాతి మాట్లాడుతూ పరిపూర్ణమైన ఆరోగ్యం కోసం యోగా, సమీకృత ఆహారం, రెగ్యులర్ హెల్త్ చెకప్ అంశాలపై వివరించారు. రక్తదానం చేసిన ఎన్ఎస్ఎస్ సభ్య విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ హీరా రాజ్పుత్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కల్పవల్లీ.. కటాక్షించు తల్లీ

శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో మూడో రోజు సందర్భంగా వివిధ ఆలయాల్లో కొలువుదీరిన అమ్మవార్లు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిస్తున్నారు. ప్రత్యేక అలంకరణల్లో ఉన్న అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు పెద్దఎత్తున ఆలయాలకు తరలి వస్తున్నారు. దీంతో అమ్మవారి ఆలయాల్లోనే కాక పట్టణం, మండల కేంద్రాలు భక్తులతో కోలాహలంగా మారుతున్నాయి. ఇదిలావుంటే బుధవారం రాజంపేట అమ్మవారిశాలలో వాసవీమాత అన్నపూర్ణదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న వాసవీ కన్యకాపరమేశ్వరీదేవిని గర్భగుడి చుట్టూ భక్తులు ఊరేగించారు. ఈసందర్భంగా అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు ఆయా ఆలయ కమిటీలు తీర్థ, అన్నప్రసాదాలను అందజేసింది.

– సాక్షి,నెట్వర్క్


నందలూరులో గజలక్ష్మీదేవిగా కన్యకా పరమేశ్వరీ


రాజంపేట టౌన్: అమ్మవారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు


రాజంపేట టౌన్: దసరా వేషధారణల్లో చిన్నారులు


రాజంపేట టౌన్: కాశీ విశాలాక్షీగా మారెమ్మ


రాయచోటి టౌన్: శ్రీ భవానీ దేవిగా పార్వతీ దేవి


రాజంపేట రూరల్: గాయత్రి దేవిగా కనకదుర్గాదేవి


రాయచోటి టౌన్: రాజ రాజేశ్వరీదేవిగా కన్యకాంబ


గాలివీడు: అన్నపూర్ణదేవిగా ఇరుగులమ్మ


చిన్నమండెం: దేవగుడిపల్లెలో శారదాదేవిగా కాళీమాత


రాజంపేట టౌన్: అన్నపూర్ణా దేవిగా వీరచాడేశ్వరి


సుండుపల్లి: అన్నపూర్ణా దేవిగా కన్యకా పరమేశ్వరి


నీలకంఠ్రావుపేటలో శారదాదేవిగా దర్గా మాతాజీ


ఒంటిమిట్ట: అన్నపూర్ణా దేవిగా వాసవాంబ


సిద్దవటం: భక్తులకు అభయమిస్తున్న దుర్గాదేవి

క్లుప్తంగా

బాపనపల్లిలో స్వామిత్వ సర్వే


సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది

సిద్దవటం : సర్వే చేసి గృహ యజమానులకు శాశ్వత గృహ హక్కు కల్పించడమే స్వామిత్వ కార్యక్రమం లక్ష్యమని శాఖరాజుపల్లి పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి తెలిపారు. బుధవారం బాపనపల్లి గ్రామంలో స్వామిత్వ సర్వే నిర్వహించినట్లు చెప్పారు. కాగా గ్రామంలోని సర్వే నెంబర్ 394, 395లో పరిశీలిస్తున్న అధికారులను గ్రామస్తుడు సుబ్బారెడ్డి అడ్డుచెప్పాడు. సర్వే ప్రకారం కేవలం ఇళ్లను మాత్రమే సర్వే చేయాలని స్థలాలను కాదని అధికారులతో వాగ్వాదానికి దిగాడు. మండల ఎస్ఐ మహమ్మద్ రఫీ, పోలీసులు గ్రామానికి చేరుకోవడంతో వివాదం సద్దుమణిగింది. ఫిర్యాదులు ఉంటే ఉన్నతాధికారులకు ఇవ్వాలని సర్వే సిబ్బంది ఈ సందర్భంగా తెలియజేశారు. ప్రతి గృహ యజమానుడికి హక్కు పత్రాలు అందజేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ కొండయ్య, సచివాలయ సర్వేయర్ ఇమ్మానుయేలు తదితరులు పాల్గొన్నారు.

సమతుల ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం


అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ జహరాబీ

లక్కిరెడ్డిపల్లి : పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని ఐసీడీఎస్ సీడీపీఓ జహరాబీ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో లక్కిరెడ్డిపల్లి పరిధి అంగన్వాడీల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సీడీపీఓ మాట్లాడుతూ సుపోషిత్ భారత్, సక్షం భారత్లో భాగంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అంగన్వాడీలకు సూచించారు. అంగన్వాడీ కేంద్రంలో ఇచ్చే పౌష్టికాహారాన్ని తింటే మంచిదన్నారు. పౌష్టికాహారంతోపాటు కూరగాయలను బాగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్ దాదిబీ, అంగన్వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

ఏయూ అధ్యాపకుడికి ఎక్సలెన్స్ అవార్డు


అవార్డును అందుకుంటున్న డా.సుబ్బారావు

రాజంపేట : అన్నమాచార్య యూనివర్సిటీ ప్రొఫెసర్ డా.సుబ్బారావు డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ అకాడమిక్స్ ఎక్సలెన్స్ అవార్డును అందుకున్నారు. ఈ మేరకు బుధవారం ఏయూ వీసీ డా.సాయిబాబారెడ్డి, ప్రిన్సిపల్ నారాయణలు అభినందించారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో సుబ్బారావు వినూత్న పరిశోధనలు, సృజనాత్మక బోధనా పద్ధతులు, విద్యార్థులలో ఆవిష్కరణాత్మక ఆలోచనలను పెంపొందించడంలో ఆయన చూపిన దూరదృష్టి అపూర్వమని కొనియాడారు.

గర్భిణులకు పోషకాహారం తప్పనిసరి


గర్భిణులకు పోషకాహారాలను ఇస్తున్న దృశ్యం

ఒంటిమిట్ట : గర్భిణులు పోషకాహారం తప్పక తీసుకోవాలని ఒంటిమిట్ట పీహెచ్సీ రెండవ వైద్యాధికారి డాక్టర్ అరుణ జ్యోతి అన్నారు. బుధవారం మండల పరిధిలోని మంటపంపల్లె గ్రామ పంచాయతీలో స్వస్త నారీ సశక్త్ పరివార్ కార్యక్రమాన్ని ఆమె వైద్య సిబ్బందిలో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నపిల్లలకు వ్యాక్సినేషన్, గర్భిణులకు పరీక్షలు, పంటి, కంటి, క్యాన్సర్, బీపీ, షుగర్ పరీక్షలు జరిపించారు. అలాగే పోషకాహారాలను అందజేసి, వాటి ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ లక్ష్మీనరసమ్మ, సీహెచ్ఓ చంద్రిక, స్త్రీ ఆరోగ్య కార్యకర్తలు సరోజ, ఉమాదేవి, అంగన్వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాశ్చాత్య సంస్కృతిని విడనాడలి

రాజంపేట : పాశ్చాత్య సంస్కృతిని విడనాడి భారతీయ సాంప్రదాయలకు పెద్దపీట వేయాలని రాజంపేట వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక బీవీఎన్ స్కూల్లో మహాత్మగాంధీ ఫెలోషిప్ అవార్డు గ్రహీత, న్యాయవాది కరణం శంకరనాయుడు పుట్టినరోజును కొండూరు శరత్కుమార్రాజు ఆధ్వర్యంలో వినూత్నంగా నిర్వహించారు. కేక్ బదులు పండ్లను కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా పేదలకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సుబ్బరామరాజు, వెంకటయ్యనాయుడు, అమ్మినేని వెంకటయ్యనాయుడు, చేజెర్ల సుబ్రమణ్యంరాజు, దగ్గుపాటి రవి, కెఎంఎల్ నరసింహులు, శివరామరాజు,సుబ్బరాజు, రామచంద్రరాజు, రఘువీర్ రాజు, కొమ్మి రామచంద్ర, రెడ్డయ్య, మేడికొండు రవి, నాసర్, మురళీ, మోహనరాజు,సుధీర్, మల్లికార్జున, అమర్, శంకర్రాజులు పాల్గొన్నారు.